కమ్మేసిన పొగమంచు

జిల్లాలో ఇటీవల విచిత్ర వాతావరణం నెలకొంది. పగలంతా ఎండా, సాయంత్రం భారీ వర్షం కురుస్తుంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం 8 గంటల వరకు మెదక్‌ను మంచు కమ్మేసింది. రోడ్లపై వాహనాలు కనిపించక పోవటంతో లైట్ల వెలుగులో ప్రయాణాన్ని సాగిస్తూ వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

– మెదక్‌జోన్:



భారీగా మంచు కురవటంతో మెదక్‌లో లైట్ల వెలుతురులో వెళుతున్న వాహనదారులు



కొడిపల్లి జాతీయ రహదారిపై పొగమంచు

మండల కేంద్రమైన కౌడిపల్లిలో బుధవారం ఉదయం పొగ మంచుకురిసింది. ఏడున్నర గంటల వరకు పొగ మంచు కప్పుకొని ఉండటంతో జాతీయ రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్లారు. పొగమంచు కమ్మేయడంతో చూపరులను కనువిందు చేసింది.

– కౌడిపల్లి(నర్సాపూర్)

క్లుప్తంగా

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

రామాయంపేట(మెదక్): రామాయంపేట ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా బి.సత్యం, కోశాధికారిగా ప్రబాకర్, ప్రధాన కార్యదర్శిగా లింగంను ఎనుకున్నారు. సహాయ కార్యదర్శులుగా రామారపు యాదగిరి, కుస్తి నారాయణ, సలహాదారులుగా రమేశ్‌గౌడ్, దేవరాజు, మర్కు నగేశ్‌ను ఎన్నుకున్నారు. తమను ఎన్నుకున్నందుకుగాను సంఘం సభ్యులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి: ఎంపీడీఓ



మాట్లాడుతున్న ఎంపీడీఓ షాకీర్‌అలీ

పెద్దశంకరంపేట(మెదక్): అధికారులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని ఎంపీడీఓ షాకీర్‌అలీ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌టీఐ (రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్)పై గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ప్రజలు దరఖాస్తు చేసుకున్న 30 రోజులలోగా సమాచారం అందించాలని సూచించారు. ఉద్యోగులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని పేర్కొన్నారు. ఎంపీఓ జాకీర్ హుస్సేన్ తదితరులున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం


ఏఎస్‌ఐ మల్లయ్య



కౌడిపల్లిలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కౌడిపల్లి(నర్సాపూర్): సైబర్ నేలరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ మల్లయ్య తెలిపారు. బుధవారం కౌడిపల్లిలో సైబర్‌నేరాలు, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఓటీపీ, బ్యాంక్ అకౌంట్, ఏటీఎం నంబర్లు చెప్పవద్దన్నారు. లాటరీ తగిలిందని లేదా ఇతర ప్రలోభాలకు గురిచేస్తే తెలియని వ్యక్తులు, సంస్థలకు ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయవద్దని చెప్పారు. సమస్యలుంటే పోలీసులకు తెలియచేయాలని చెప్పారు.


అక్రమ మద్యం స్వాధీనం



లిక్కర్‌ను చూపుతున్న టాస్క్‌పోర్స్ పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై మెదక్ టాస్క్‌ఫోర్స్ దాడులు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకుంది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. టాస్క్‌పోర్స్ అధికారులు మండలంలోని కాళ్లకల్ గ్రామంలో కిరాణాదుకాణం నడుపుతున్న ప్రభాకర్‌గౌడ్ అక్రమంగా మద్యం అమ్ముతున్న సమాచారం మేరకు దాడి చేశారు. 120 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మనోహరాబాద్ ఎస్ఐ సుభాష్‌గౌడ్, టాస్క్‌పోర్స్ అధికారులు పాల్గొన్నారు.

వృథాగా నీరు.. ఏం చేస్తున్నారు మీరు?



జగిర్యాల చెరువు వద్ద అలుగు పారుతూ వృథాగా పోతున్న నీళ్లు

నెల రోజులుగా పారుతున్న అలుగు

- వర్షం పడితే రాకపోకలు బంద్
- జలసంరక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్

రేగోడ్(మెదక్): నీరు.. గాలి లేకపోతే మనిషి మనుగడే లేదు. అలాంటి నీళ్ల కోసం ప్రజలు నానా అవస్థలు పడుతుంటారు. వేసవిలో ట్యాంకర్లు పెట్టి నీళ్లను సరఫరా చేస్తారు. బోరుబావుల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయిన పరిస్థితి ఉంది. కానీ ప్రస్తుతం నీళ్లన్నీ వృథాగా పోతోంది. నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రేగోడ్ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 6 పెద్ద చెరువులు, 56 కుంటలు, 20 చెక్ డ్యాంలు ఉన్నాయి. వేసవి నుంచే వర్షాలు మొదలవడం.. ఇటీవల మళ్లీ భారీ వర్షాలు కురుస్తుండంతో చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు అన్నీ నిండి జలకళను సంతరించుకున్నాయి. ఎన్నడూలేని విధగా ప్రస్తుతం నెల రోజులుగా జగిర్యాల చెరువు అలుగులు పారుతూనే ఉంది. భారీ వర్షం వస్తే రేగోడ్-జగిర్యాల వైపు రాకపోకలు నిలిచిపోతున్నాయి. నెల రోజులుగా అలుగుపై పొంగి పార్లుతూ నీళ్లన్నీ వృథాగా పోతోంది. చెరువులోని నీటిని కాపాడుకుంటే వేసవిలో నీటి కష్టాలు ఉండకుండా ఉపయోగం ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఈ చెరువు కింద ఉన్న పంటలు కూడా మొత్తంగా పాడయ్యాయి.

చెరువు కట్టకు లీకేజీ..

భారీ వర్షాల కారణంగా కొండాపూర్ సమీపంలో చెరువు కట్టకు లీకేజీ పడింది. దీంతో నీళ్లు కట్ట కింది భాగం నుంచి రోడ్డుపై నుంచి వృథాగా పోతోంది. నీళ్లు రోడ్డుపై పారుతుండటంతో తారు రోడ్డు పాడవుతోంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లను సంక్షించాలి



జగిర్యాల-కొండాపూర్ చెరువు అలుగు పారుతోంది. కొన్ని రోజులుగా అలుగు పొంగి రోజూ రోడ్డుపై పారుతోంది. భారీ వర్షం పడితే రాకపోకలు నిలిచిపోతున్నాయి. నీళ్లు వృథాగా పోకుండా చర్యలు తీసుకుని, అలుగు వద్ద వంతెన నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలి.

: లక్ష్మణ్, మాజీ ఆదర్శ రైతు కొండాపూర్

రెవెన్యూ కార్యాలయం తరలించొద్దు



రెవెన్యూ కార్యాలయలం ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చిలప్‌చెడ్ గ్రామస్తుల ధర్నా

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లో ఉన్న రెవెన్యూ కార్యాలయం, ఇతర గ్రామాలకు తరలిస్తే ఊరుకునేది లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. చిలప్‌చెడ్ గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయంలో గదులు చిన్నగా ఉండటంతో అటు అధికారులకు, ఇటు ప్రజలు ఇబ్బందిగా ఉంది. దాంతో తహశీల్దార్ సహదేవ్ రెవెన్యూ కార్యాలయాన్ని చిలప్‌చెడ్ నుంచి, శీలాంపల్లి గేటుకు తరలించాలనే ప్రస్తావన తీసుకొచ్చారు. విషయం గ్రామస్తులకు తెలియడంతో పార్టీలకు అతీతంగా స్థానికులు ధర్నాకు దిగారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా, కార్యాలయాన్ని తరలించాలనే ఆలోచన వచ్చింది. కానీ.. ఉన్నతాధికారుల ఆదేశాలు లేనిదే సాధ్యపడదన్నారు.

ఆటోను ఢీ కొట్టిన వ్యాన్

నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ ప్రయాణికులు

కొల్చారం(నర్సాపూర్): ప్రయాణికులతో వెళుతున్న ఆటోను వ్యాన్ వెనుక నుంచి ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మెదక్– నర్సాపూర్ జాతీయ రహదారి పోతంశెట్టిపల్లి శివారు మలుపు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీలు ఫకీర్ రాజు, నింగోల లచ్చయ్య, టేక్మాల్ రాజు, చింతల బాలయ్య ఇదే మండలంలోని రాంపూర్‌లో పని ముగించుకొని ఆటోలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోను హనుమాన్ బండల్ మలుపు వద్దకు రాగానే వెనుక నుంచి వ్యాను ఢీకొట్టింది. ఆటోలో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం 108 వాహనంలో మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రికెట్ జట్టుకు టీషర్టులు అందజేత

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రికెట్ జట్టు విద్యార్థులకు దాతలు టీషర్టులను అందజేశారు. ఈ సందర్భంగా దాత చిన్నశంకరంపేట మాజీ సర్పంచ్ రాజిరెడ్డి మాట్లాడుతూ చేగుంటలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించే చేగుంట క్రికెట్ లీగ్ పోటీల్లో పాల్గొనే కాలేజీ క్రాకర్స్ జట్టు సభ్యులకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లెక్చరర్ నర్సింహులు, దేవేందర్, క్రాకర్స్ జట్టు కోచ్ ప్రమోద్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ లావణ్య తెలిపారు. బుధవారం పెద్దగొట్టిముక్కుల గ్రామంలో పలువురు రైతుల పొలంలో ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగులో అటవీ జంతువుల బెడద ఉండదని చెప్పారు. నాలుగేళ్లలో పంట చేతికి వస్తుందన్నారు. అప్పటి వరకు అంతర పంటను సాగు చేయవచ్చన్నారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై అందచేస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పెద్దగొట్టిముక్కులలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఏఓ

గాంధీజీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సరికాదు

కాంగ్రెస్ నేత రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): గాంధీజీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రాజిరెడ్డి అన్నారు. మండలంలోని యశ్వంతరావ్‌పేటలో గాంధీ జయంతి రోజున గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ అదే గ్రామంలో ప్రతిష్టించిన నూతన విగ్రహానికి బుధవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్ రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, పోతిరెడ్డి, నర్సింహారెడ్డి, రామకృష్ణారావ్, కుస్తి శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కష్టపడితేనే బంగారు భవిష్యత్

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు కష్టపడితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి అన్నారు. బుధవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సన్మానించింది. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయవద్దని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లెక్చరర్లు అనంత రాజశర్మ, ప్రభాకర్, రాజు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



సమీక్షిస్తున్న ఎన్నికల అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఎన్నికల అధికారులు షాకీర్ అలీ, విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 12 ఎంపీటీసీ, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు జరగనున్నట్లు తెలిపారు. దీని కోసం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి శనివారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని చెప్పారు. ఎంపీటీసీలకు నాలుగు కౌంటర్లు, జెడ్పీటీసీకి ఒక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు. కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, నామినేషన్లు వేసే వారితో పాటు ముగ్గురికి మాత్రమే లోనికి అనుమతి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు.

దరఖాస్తులకు 18 వరకు చివరి గడువు

ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా



నర్సాపూర్: వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసేందుకు ఈనెల 18న చివరి గడువని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గులాం ముస్తఫా తెలిపారు. మద్యం దుకాణాల కోసం తమ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వ్యక్తులు వైన్ షాపుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసేందుకు రూ.3లక్షలు రుసుం చెల్లించాల్సి ఉంటుందని, ఆ రుసుం తిరిగి రాదని ఆయన స్పష్టం చేశారు. నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 17 మద్యం దుకాణాలు ఉన్నాయని, నిబంధనల మేరకు పలు దుకాణాలు ఆయా సామాజిక వర్గాలకు రిజర్వ్ చేశారని ఆయన వివరించారు. కాగా కొత్త లైసెన్సు దుకాణాలు డిసెంబరు ఒకటి నుంచి ప్రారంభమవుతాయని, రెండు సంవత్సరాలు లైసెన్సు కాలపరిమితి ఉంటుందని గులాం ముస్తఫా తెలిపారు. నర్సాపూర్‌లోని ఒక దుకాణానికి ఇప్పటి వరకు ఒక దరఖాస్తు వచ్చిందని ఆయన చెప్పారు.

స్థానిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో మండలం రెండోవిడతలో ఉందన్నారు. దీంతో ఈనెల 13 నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీకి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీల నామినేషన్లకు నాలుగు కౌంటర్లు, జెడ్పీటీసీకి ఒక కౌంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడ పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీఓ కలీముల్లా ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

సంక్షిప్త వార్తలు

◆ **విద్యార్థుల హాజరుశాతం పెంచాలి**

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులు హాజరుశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని చిన్నశంకరంపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం దీప్లారాథోడ్ కోరారు. బుధవారం చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాలలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరుశాతం 85 శాతం ఉండేలా చూడాలని కోరారు. విద్యార్థుల అభ్యాసన ప్రతిభను చూపేల కృషి చేయాలన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ**

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లికి చెందిన నరేష్‌గౌడ్‌కు రూ 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చిన్నంరెడ్డి, శాకయ్య, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌గుప్త, మక్బూల్ పాల్గొన్నారు.

◆ **వైభవంగా భవానీమాత పల్లకి సేవ**

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక భవానీమాత పల్లకిసేవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి రామాలయం వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దారిపొడువునా మహిళలు అమ్మవారికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఆర్‌ఎన్.సంతోష్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులున్నారు.

◆ **'కోడ్' నిబంధనలు పాటించాలి**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలు పాటించాలని ఏఎస్ఐ రాములు అన్నారు. బుధవారం సిబ్బందితో కలసి మండల పరిధిలోని చిట్కుల్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా రూ. 50 వేల నగదు కంటే ఎక్కువ తీసుకుపోకూడదని చెప్పారు. మద్యం, మత్తు పదార్థాల రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


◆ **పౌష్టికాహారంపై అవగాహన**

చిన్నశంకరంపేట(మెదక్): గర్భిణిలతో పాటు తల్లులు సరైన పౌష్టికాహారం పొందాలని నార్సింగి మండల ఐసీడీఎస్ సైపర్‌వైజర్ సుజాత కోరారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలోని 2, 5, 6వ అంగన్వాడీ కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణిలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు సావ్య, మహేశ్వరీ, బాలమణి, ఏఎన్‌ఎం ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

◆ **మత్తు మహమ్మారిని తరిమేద్దాం**
సిద్దిపేట టూటౌన్ ఎస్ఐ షేక్ ఆసీఫ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మత్తు మహమ్మారిని తరిమేసే బాధ్యత మనందరిపై ఉందని సిద్దిపేట టూటౌన్ ఎస్ఐ షేక్ ఆసీఫ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మెరిడియన్ పాఠశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి వ్యసనాలకు బానిస కాకుండా, కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థి బాధ్యత అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి, మహేందర్, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు: ఎస్ఐ రాజేష్



నిజాంపేట(మెదక్): రోడ్డుపై ధాన్యం, విత్తనాలు ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో రోడ్డుపై విత్తనాలు, ధాన్యం ఎండబెట్టడంతో ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. ఈ ప్రమాదాల్లో ముగ్గురు చనిపోగా.. కొంత మందికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు.కావున రైతులు సురక్షిత ప్రదేశాల్లో ఎండబెట్టుకొని సహకరించాలని కోరారు. రోడ్డుపై ధాన్యం ఎండబెట్టిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

సాదాబైనామా సమస్యను పరిష్కరిస్తాం

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో సాదాబైనామా సమస్యలకు పరిష్కారం తీసుకుంటున్నట్లు, ధూళ్మిట్ట మండల తహసీల్దార్ ప్రవీన్‌రెడ్డి తెలిపారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 సంవత్సరం దరఖాస్తు చేసుకున్న 1275 సాదాబైనామాలకు సంబంధించిన అమ్మకందార్లు, కొనుగోలుదారులకు నోటీసులు అందించామన్నారు. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చంద్రారెడ్డి, లక్ష్మి, యాదగిరి, నాయకులు సాయిలు, జగన్, సుమన్, నర్సింహులు, అనిల్, పాల్గొన్నారు.